TGTEL/25/A1907

# అమృత్ తెలంగాణ

తెలుగు దిన పత్రిక

సంపుటి: 01 సంచిక : 257 ఎడిటర్ : సింగిడి అమృత్, తెలంగాణ సోమవారం.13.04.2026 పేజీలు : 8, వెల:రూ.2.00

PUBLISHED FROM ADILABAD,NIRAML,MANCHIRAL,KOMARAMBHEEM, ASIFABADKARIMNAGAR,JAGITIYALA,PEDAPALLI,JAI SHANKA BHUPALLI, NIZAMABAD,KAMAREDDY,MEDCHEL,HYDERABAD

## వదిలేదు లేదు.. ప్రతి బొగ్గు గనిలో మళ్లీ అగ్ని మండిస్తాం- సీఎం రేవంత్ కు కేటీఆర్ వార్నింగ్



హైదరాబాద్, అమృత్ తెలంగాణ: సీఎం రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి కేటీఆర్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. సీఎం రేవంత్ ఫ్యామిలీ రాష్ట్రాన్ని దోచుకుంటోందని ఆరోపించారు. 100 రోజుల్లో 6 గ్యారెంటీలు అమలు చేస్తామన్న సీఎం రేవంత్.. 30 నెలలు అయినా ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. ఆదిలాబాద్ లో మెడికల్ బోర్డు ఏర్పాటు చేయకపోతే బొగ్గు గనిలో అగ్గి మండిస్తామని హెచ్చరించారు కేటీఆర్.

రేవంత్ రెడ్డి నికృష్టమైన రాజకీయం చేస్తున్నారు. మంత్రి, ఎంపీ కౌన్సిల్ హాల్ లోనే ఉన్నారు. బీఆర్ఎస్ మహిళా కౌన్సిలర్లతో కాంగ్రెస్ కౌన్సిలర్లు వచ్చి అసభ్యంగా ప్రవర్తిస్తే చిరు నవ్వులు చిందిస్తూ కూర్చున్నారు తప్ప మంత్రి కానీ, ఎంపీ కానీ కనీసం వారిని ఆపే ప్రయత్నం కూడా చేయలేదు. ఇంత గలీజు రాజకీయం చూడలేదు. ఇంత నికృష్టమైన రాజకీయం చేసి వారు ఏం సాధిద్దామని అనుకుంటున్నారో తెలియడం లేదు.

నాడు పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న రేవంత్ రెడ్డి, సీఎల్పీ లీడర్ గా ఉన్న భట్టి విక్రమార్క.. మీరిద్దరే సంతకాలు పెట్టారు, మీరిద్దరూ గ్యారెంటీ కార్డులు అంటూ ఇంటింటికి వచ్చారు. మీరిద్దరే కదా జేమ్స్ బాండ్ లెక్క బాండ్ పేపర్ల మీద సంతకాలు పెట్టింది. నూరు రోజుల్లో 6 గ్యారెంటీలు అమలు చేస్తామన్నారు. 30 నెలలు అవుతున్నా ఎందుకు అమలు చేయలేదు? 30 నెలలు అవుతున్నా 6 గ్యారెంటీలు అమలు కాకపోతే మిమ్మల్ని ఏమనాలి? ముఖ్యమంత్రి ముఖ్యమంత్రిలా లేరు. మంత్రి మంత్రిలా లేరు. ఎమ్మెల్యేలు ఎమ్మెల్యేల లెక్క లేరు. మొత్తం అంతా ఒకే దుకాణం పెట్టారు.


దోచుకో, దాచుకో స్కీమ్ నడుస్తోంది. ఏది దొరికితే అది దోచుకోవడం, తీసుకెళ్లి దాచుకోవడం. చాలా సిగ్గుచేటు. ముఖ్యమంత్రి మొత్తం కుటుంబం రాష్ట్రంలో దోపిడీకి పాల్పడుతోంది. దమ్ముంటే నీ బావమరిది సృజన్ రెడ్డి మీద వెంటనే ఒక సిట్, ఏసీబీ విచారణ వేయ్. ఎవరు దొంగనో, ఎవరు దొంగతనం చేశారో బయటకు వస్తుంది. మీరు వేయాల్సిన విచారణలు మేము ఇచ్చిన 16వేల ఉద్యోగాల మీద కాదు. ముందు ఇక్కడ మెడికల్ బోర్డు పెట్టింది. లేదంటే సింగరేణి ప్రధాన కార్యాలయాన్ని ముట్టడిస్తాం. ప్రతి బొగ్గు గనిలో మళ్లీ అగ్ని మండిస్తాం వదిలేది లేదు" అని సీఎం రేవంత్ ని హెచ్చరించారు కేటీఆర్.

## మళ్లీ టీఆర్ఎస్గా..కేటీఆర్ కీలక వ్యాఖ్యలు



హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: బీఆర్ఎస్ను మళ్లీ టీఆర్ఎస్గా మార్పు చేసే అంశాన్ని పరిశీలిస్తామని ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. తమకు పొత్తులతో కలిసిరాదని, కుదరదని వ్యాఖ్యానించారు. గతంలో తాము కొన్ని చిన్నచిన్న తప్పులు చేశామని తెలిపారు. అప్పుడు ప్రజలకు నాయకులకు మధ్య దూరం పెరిగిందని, గతంలో జరిగిన తప్పులపై అధ్యయనం చేశామని అన్నారు. లోపాలను సరిదిద్దుకుంటామని చెప్పారు. ఈసారి వచ్చేది బీఆర్ఎస్సేనని.. కేసీఆర్ మళ్లీ సీఎం అవుతారని ధీమా వ్యక్తం చేశారు. మంచిర్యాల జిల్లా క్యాతనపల్లిలో సమావేశం అనంతరం కేటీఆర్ మీడియాతో చిట్చాట్గా మాట్లాడారు. అన్ని పథకాల్లో కాంగ్రెస్ విఫలమైందన్నారు.కాగా ఈ నెల 25వ తేదీన పార్టీని ప్రారంభించనున్నట్లు ఇప్పటికే ప్రకటించిన కవిత తన పార్టీ పేరును తెలంగాణ రాష్ట్ర సమితిగా పరిశీలిస్తున్నట్లు చేసిన వ్యాఖ్యలు బీఆర్ఎస్ శ్రేణుల్లో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. "పాత పేరు, కొత్త జెండా, కొత్త అజెండాతో ప్రజల ముందుకు వస్తాను" అని ఆమె చెప్పడం ఈ చర్చకు మరింత బలాన్నిచ్చింది. దీంతో తెలంగాణ సెంటిమెంట్తో మమేకమైన పేరును కవిత సొంతం చేసుకుంటే .. దాని ప్రభావం బీఆర్ఎస్పై ఎలా ఉ ండబోతుందనేది ఉత్కంఠ రేపుతోంది. ఈ నేపద్యంలో కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు సంచలనం సృష్టిస్తున్నాయి.

## ఐలాపూర్ తాండ కూల్చివేతలపై స్టేటస్కో




హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: సంగారెడ్డి జిల్లా అమీన్పూర్ మండలం ఇలాపూర్ తండాలో ఇండ్ల కూల్చివేత ప్రయత్నాలపై తెలంగాణ హైకోర్టు స్టేటస్ కో (యథాతథ స్థితి) ఉత్తర్వులు జారీ చేసింది. న్యాయమూర్తి జస్టిస్ విజయసేన్ రెడ్డి ఈ మేరకు శనివారం తన ఇంటి వద్ద విచారణ జరిపిన అనంతరం మధ్యంతర ఆదేశాలు వెలువరించారు. గజ్జా రంగారావు సహా 12 మంది పిటిషనర్లు దాఖలు చేసిన రిట్ పిటిషన్లో తమ ఇండ్లను ఎలాంటి ముందస్తు నోటీసు లేకుండా కూల్చివేయడానికి అధికారులు తీసుకునే చర్యలను అడ్డుకోవాలని కోరారు. ఐలాపూర్ తండాలోని సర్వే నం.119 పరిధిలో తమ ఇండ్లు దశాబ్దాలుగా ఉన్నాయనీ, పూర్వీకుల కాలం నుంచే నివసిస్తున్నామని తెలిపారు. 1956 నుంచే ఆ భూముల్లో ఉంటున్నారని చెప్పారు. పన్నులు, విద్యుత్, నీటి బిల్లులు క్రమం తప్పకుండా చెల్లిస్తున్నప్పటికీ, అకస్మాత్తుగా హైడ్రా యంత్రాంగం బలవంతంగా ఖాళీ చేయించే ప్రయత్నం చేస్తోందని కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. తెల్లవారుజామున భారీ సంఖ్యలో హైడ్రా, పోలీసు సిబ్బంది బుల్డోజర్లు, జేసీబీలతో అక్కడికి చేరుకుని కూల్చివేతకు సిద్ధమయ్యారన్నారు ఎలాంటి నోటీసు ఇవ్వకుండా, తమ వాదనలు వినకుండా చర్యలు చేపట్టారని వాదించారు. ఈ వాదనలపై స్పందించిన న్యాయమూర్తి.. అక్రమ నిర్మాణాలంటూ కూల్చివేతలను సెలవుల్లోనే ఎందుకు చేపడతారంటూ హైడ్రాను ప్రశ్నించారు. సెలవు రోజుల్లో కూల్చివేతలు ఎందుకు చేయాలని ప్రశ్నించారు. నోటీసులు ఇవ్వకుండా ఎలా చర్యలు తీసుకుంటారని అడిగారు బుల్డోజర్ కేసులో ఇటీవల సుప్రీం కోర్టు స్పష్టత ఇచ్చినా హైడ్రా వైఖరిలో మార్పు ఎందుకు రావడం లేదన్నారు. ఐలాపూర్ తాండ కూల్చివేతలపై యథాతథస్థితిని కొనసాగించాలని మధ్యంతర ఉత్తర్వులను వెలువరించారు. పిటిషన్లో.. ఐలాపూర్ తాండలో సర్వే నెం.119లో సుమారు మూడు వేల మంది ఉన్నారు. వంద గజాల జాగాలోనే నివాసం ఉండే పేదవాళ్లు, రోజూ కూలిపనులు చేసుకునేవాళ్లు, నిరక్షరాస్యులు... పూర్వీకుల నుంచి వచ్చిన స్థలాల్లో ఇండ్లు నిర్మించుకుని జీవిస్తున్నారు. ఇండ్లకు విద్యుత్తు, నీటి పన్నులు చెల్లిస్తున్నారు. ఎలాంటి సమాచారం, నోటీసు లేకుండా శనివారం తెల్లవారు జామున 2 గంటలప్పుడు హైడ్రా మూడు వేల మందితో వచ్చి కూల్చివేత చర్యలు చేపట్టింది. హైడ్రాకు చెందిన డీఆర్ఎఫ్ సిబ్బంది ఆయుధాలు, బుల్డోజర్లు, జెసీబీలు, ఇతర యంత్రాలతో కూల్చివేత చర్యలు మొదలుపెట్టారు. బలప్రయోగంతో ఖాళీ చేయిస్తున్నారని పేర్కొన్నారు. దీనిపై న్యాయమూర్తి ఐలాపూర్ తాండ సర్వే నెం.119లో స్టేటస్కో కొనసాగించాలని హైడ్రాకు ఆదేశాలిచ్చింది. ప్రతివాదులకు నోటీసులు ఇచ్చింది. విచారణను వాయిదా వేసింది.

రూల్స్ ప్రకారమే కంచె

ప్రభుత్వ భూములపై కంచె ఏర్పాటు చేయాలంటే చట్టబద్ధమైన విధానాలను తప్పనిసరిగా అనుసరించాలని హైడ్రాకు హైకోర్టు ఆదేశించింది. 'ప్రభుత్వ భూమి' అన్న పేరుతో నియమాలు పక్కనబెట్టి యథేచ్ఛగా కంచెలు వేయడం అనుమతించబోదని స్పష్టం చేసింది.నిషేధిత జాబితాలో ఉందనే కారణంతోనే భూములకు కంచె వేయడం సరైంది కాదని కోర్టు అభిప్రాయపడింది. సంబంధిత భూమి నిజంగా ప్రభుత్వానికి చెందినదనే ధృవీకరణ, అవసరమైన అనుమతులు లేకుండా కంచె వేయకూడదని పేర్కొంది. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం ఖానామెట్లో 1.26 ఎకరాల భూమికి హైడ్రా కంచె వేసిన చర్యను సవాలు చేస్తూ సికింద్రాబాద్కు చెందిన ఎన్.సబిత దాఖలు చేసిన పిటిషన్పై జస్టిస్ శ్రవణ్ కుమార్ విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫున న్యాయవాది వాదిస్తూ, ఒక వ్యాపారవేత్త ఇచ్చిన సమాచారాన్ని ఆధారంగా తీసుకుని తమ భూమిని నిషేధిత జాబితాలో ఉందని పేర్కొంటూ కంచె వేసి, బోర్డులు కూడా ఏర్పాటు చేశారని తెలిపారు. తమ ఆస్తిలో జోక్యం చేసుకోవద్దని, ఇప్పటికే ఏర్పాటు చేసిన బోర్డులను తొలగించాలని కోర్టును అభ్యర్థించారు. వాదనలు విన్న న్యాయమూర్తి, కేవలం నిషేధిత జాబితా ఆధారంగా కంచె వేయడం చట్టవిరుద్ధమని పేర్కొన్నారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్ నుంచి పూర్తి వివరాలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే కంచె వేయడానికి ముందు ఆ భూమిపై ఏవైనా వివాదాలు లేదా కేసులు ఉన్నాయా? అన్నది నిర్ధారించుకోవాలని పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శికి సూచించారు. ఈ ఆదేశాలను వెంటనే అమలు చేయాలని హైడ్రాను ఆదేశించిన కోర్టు, ఉత్తర్వుల ప్రతులను హైడ్రా కమిషనర్తో పాటు ప్రభుత్వానికి పంపాలని రిజిస్ట్రీకి సూచించింది. కలెక్టర్ను ప్రతివాదిగా చేర్చాలని పిటిషనర్కు సూచిస్తూ విచారణను ఈ నెల 13కు వాయిదా వేసింది.

చెరువుల్లో గుర్రపు డెక్క తొలగించాలి: హైకోర్టు

రంగారెడ్డి జిల్లా సరూర్నగర్ చెరువులో పేరుకుపోయిన గుర్రపు డెక్కను వెంటనే తొలగించి, దోమల నివారణకు సమగ్ర చర్యలు చేపట్టాలని జీహెచ్ఎంసీకి హైకోర్టు ఆదేశించింది. సరూర్నగర్ చెరువుతోపాటు జీహెచ్ఎంసీ పరిధిలోని ఇతర చెరువులన్నింటిలోనూ ఇలాంటి మలినాలను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించింది. చెరువుల్లో పేరుకుపోయే గుర్రపు డెక్క వల్ల దోమలు విస్తరించి ప్రజారోగ్యానికి ముప్పు ఏర్పడుతోందని కోర్టు పేర్కొంది.దోమల నియంత్రణలో భాగంగా ఫాగింగ్, లార్వా నివారణ చర్యలను సమర్థవంతంగా అమలు చేయాలని, ఈ పనుల పర్యవేక్షణ కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని ఆదేశించింది. చేపట్టిన చర్యలపై వివరాలతో కూడిన నివేదిక సమర్పించాలని కోరుతూ విచారణను ఈ నెల 16కు వాయిదా వేసింది. సరూర్నగర్ చెరువులో గుర్రపు డెక్క సమస్యపై పలుమార్లు ఫిర్యాదులు చేసినా స్పందన రాలేదని సైదాబాద్కు చెందిన డి. కీర్తికిరణ్ దాఖలు చేసిన పిటిషన్పై జస్టిస్ ఎన్.వి. శ్రవణ్ కుమార్ విచారణ జరిపారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదిస్తూ, సరూర్నగర్ ఎమ్మెల్యే సుధీర్రెడ్డి అసెంబ్లీలోనే ఈ సమస్యను ప్రస్తావించినప్పటికీ అధికారులు చర్యలు తీసుకోలేదని తెలిపారు. దోమల సంఖ్య అధికమవడంతో ఆ ప్రాంతంలో నివాస పరిస్థితులు దెబ్బతిన్నాయని వివరించారు. పిటిషనర్ సమర్పించిన ఫొటోలను పరిశీలించిన న్యాయమూర్తి, ప్రజాప్రతినిధి అసెంబ్లీలో సమస్యను ప్రస్తావించినా అధికారులు స్పందించకపోవడం పట్ల ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

## ఆధారాలు లేకుండా మాట్లాడితే పరువు నష్టం దావాలు వేస్తాం



ములుగు : అమృత్ తెలంగాణ: త్యాగం, సేవ అనేవి కాంగ్రెస్ పార్టీ లక్షణాలని టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేశ్ కుమార్గౌడ్ అన్నారు. ములుగు జిల్లా కాంగ్రెస్ కమిటీ నూతన సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం జిల్లా కేంద్రంలోని లీలా గార్డెన్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ దేశంలోనే కాక ప్రపంచంలో అత్యంత చారిత్రాత్మకమైన పార్టీ అని అన్నారు. పార్టీ శాశ్వతమని, ప్రభుత్వాలు వస్తూ పోతాయని, తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి కార్యకర్తల కృషి, కష్టం కీలకమని గుర్తుచేశారు. గత పాలనలో రాష్ట్రం అప్పులు భారీగా పెరిగినప్పటికీ, ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి నేతృత్వంలో ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ముందుకు వెళ్తున్నామని తెలిపారు. పదవుల కోసం కాకుండా సేవ కోసం కాంగ్రెస్ పని చేస్తుందన్నారు.

వాళ్లే ఆ ఆరోపణలు చేస్తున్నారు : మంత్రి సీతక్క

అవినీతి సీతక్క అంటూ తప్పుడు మాటలు మాట్లాడితే తగిన బుద్ధి చెప్తామని మంత్రి సీతక్క ఘాటు వ్యాఖ్యలు చేశారు. పదవులు పొందడం కంటే పార్టీ కోసం పని చేయడం ముఖ్యమని స్పష్టం చేశారు. అలాంటి నాయకులకే ఉన్నత పదవులు వస్తాయని, అందుకు ఉదాహరణగా మహేశ్కుమార్గౌడ్ ఎదుగుదలను ప్రస్తావించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను జీర్ణించుకోలేక ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత పదేండ్లలో తెలంగాణను తమ సొంత ఆస్తిగా భావించిన నాయకులు ఇప్పుడు అసత్య ఆరోపణలకు దిగుతున్నారని విమర్శించారు. ఆధారాలు లేకుండా మాట్లాడితే సహించబోమని హెచ్చరించారు. అవసరమైతే కోర్టుకు వెళ్లి పరువు నష్టం దావాలు వేస్తామన్నారు. ఇప్పటికే కొంతమందిపై సైబర్ క్రైమ్ కేసులు కూడా నమోదు చేసినట్టు వెల్లడించారు. అంగన్వాడీ సిబ్బందికి ఫోన్ల కొనుగోలు విషయంలో అవినీతి జరిగిందన్న ఆరోపణలను ఆమె ఖండించారు. కేంద్రం సూచించిన నిబంధనల ప్రకారం పారదర్శకంగా టెండర్ ప్రక్రియ నిర్వహించామని చెప్పారు. మొదట రూ.14,000 కోట్ వచ్చినప్పటికీ దాన్ని రద్దు చేసి, చివరకు రూ.11,650 లకు కొనుగోలు చేశామని వివరించారు. ఈ విషయంలో ప్రతిపక్షాలు తప్పుడు లెక్కలు చెబుతున్నాయన్నారు. ప్రజలు సంతోషంగా ఉంటే ప్రతిపక్షాలకు అసహనం పెరుగుతోందని విమర్శించారు. మేడారం ప్రాంతంలో చేపట్టిన అభివృద్ధి పనులపై వచ్చిన విమర్శలను సీతక్క కొట్టిపారేశారు. మేడారం గద్దెల వద్ద జరిగిన ప్రమాదాన్ని రాజకీయంగా వాడుకోవడం సరికాదన్నారు. పనుల్లో లోపం ఉంటే సరిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తప్పుడు ప్రచారాన్ని గట్టిగా ఎదుర్కొని పార్టీ ప్రతిష్టను కాపాడాలని సూచించారు. కార్యక్రమంలో భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, పీసీసీ ప్రధాన కార్యదర్శి రామిరెడ్డి, మున్సిపల్ చైర్పర్సన్ చింతనిప్పుల చంద్రకళ, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి కుంజసూర్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ భానోత్ రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్మెన్ రేగ కళ్యాణి, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు గొల్లపల్లి రాజేందర్ గౌడ్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు వంగ రవి యాదవ్ పాల్గొన్నారు.

## ఫార్మాస్యూటికల్ హబ్గా తెలంగాణ



హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: దేశంలోనే ప్రముఖ ఫార్మాస్యూటికల్ హబ్గా ఎదిగిందని, కోవిడ్ సమయంలో ప్రపంచాన్ని హైదరాబాద్ ఆదుకున్న దని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన డీ అడిక్షన్ కౌన్సెలింగ్ సెంటర్, ఇంటోక్సికేషన్ సెంటర్ను మంత్రి ప్రారంభించారు. అనంతరం గాంధీ మెడికల్ కాలేజీ అల్యూమినీ ఆడిటోరియంలో 'డ్రగ్స్ వినియోగం, వాటి వల్ల కలుగుతున్న అనర్థాలు' అంశంపై నిర్వహించిన రాష్ట్ర స్థాయి అవగాహనా కార్యక్రమంలో మంత్రి మాట్లాడారు. "డ్రగ్స్ కంట్రోల్, రెగ్యులేటరీ స్ట్రెంగ్తెనింగ్ డే అత్యంత ముఖ్యమైనదని, సురక్షితమైన, నాణ్యమైన ఔషధాల వినియోగాన్ని ప్రోత్సహించడం, మెడిసిన్ దుర్వినియోగాన్ని నివారించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యం అని తెలిపారు. రాష్ట్రంలో మెడిసిన్, వ్యాక్సిన్ తదితర తయారీ యూనిట్లు 1500, 80 టెస్టింగ్ సెంటర్లు, 50వేలకు పైగా మెడికల్ షాపులు ఉన్నాయని వివరించారు. తెలంగాణలో తయారయ్యే మందులు, వ్యాక్సిన్లు ప్రపంచ వ్యాప్తంగా వినియోగంలో ఉ న్నాయని చెప్పారు. కోవిడ్ సమయంలో కీలక ఔషధాలు, వ్యాక్సిన్లు సరఫరా చేసి హైదరాబాద్ ప్రపంచాన్ని ఆదుకున్న దని గుర్తు చేశారు. హైదరాబాద్ను ప్రపంచం విశ్వసనీయ వైద్య సేవలందించే కేంద్రంగా, ఫార్మాహబ్గా గుర్తించిందని తెలిపారు. నకిలీ మందులు, నాసిరకం ఔషధాలు, మత్తు మందుల దుర్వినియోగంపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా రెగ్యులర్ ఇన్స్పెక్షన్లు నిర్వహిస్తున్నామని, గడిచిన రెండున్నరేండ్లలో 50 వేలకుపైగా తనిఖీలు చేపట్టినట్టు తెలిపారు. యువతలో డ్రగ్ దుర్వినియోగం పెరుగుతున్నదని, ఇది సామాజిక సమస్యగా కాకుండా ఆరోగ్య సమస్యగా చూడాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 35 ప్రభుత్వ జనరల్ హాస్పిటల్స్లో డీ-అడిక్షన్ కౌన్సెలింగ్ సెంటర్లు, స్పెషల్ ఇంటోక్సికేషన్ కేర్ యూనిట్లు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. స్క్రీనింగ్, ట్రీట్మెంట్, కౌన్సెలింగ్, ఫాలోఅప్ సేవలందిస్తున్నామని చెప్పారు. ఎర్రగడ్డలోని మెంటల్ హెల్త్ ఇనిస్టిట్యూట్లో డీ-అడిక్షన్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ప్రారంభించామని తెలిపారు. డ్రగ్ నేరాలపై కట్టుదిట్టమైన చర్యల కోసం ఈగల్ వ్యవస్థను ఏర్పాటు చేశామన్నారు. యువత మెడిసిన్ను మత్తు పదార్థాలుగా వాడుతోందనీ, దీన్ని అరికట్టడంలో, మందుల సరైన వినియోగంలో ఫార్మాసిస్టుల పాత్ర చాలా కీలకం అని, బాధ్యతాయుతంగా మందులు ఇవ్వడం ద్వారా దుర్వినియోగాన్ని తగ్గించొచ్చు అని సూచించారు. 'యాంటీ మైక్రోబైల్ రెసిస్టెన్సీ' అనేది ప్రపంచవ్యాప్తంగా పెద్ద ఆరోగ్య సమస్యగా మారుతోందన్నారు. క్యూఆర్ కోడ్ వెరిఫికేషన్, ఆన్లైన్ ఫార్మసీ మానిటరింగ్ ద్వారా పారదర్శకత పెంచుతున్నామని తెలిపారు. 'ప్రివెన్షన్ ఈజ్ బెటర్ దెన్ క్యూర్' అనే సూత్రంతో ముందుకు సాగుతున్నామని చెప్పారు.

# ప్రజల సౌకర్యార్థం పోలీస్ స్టేషన్ నూతన భవనం ప్రారంభం: డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ శివధర్ రెడ్డి







అమృత్ తెలంగాణ మంచిర్యాల జిల్లా న్యూస్ ఏప్రిల్ 12, 2026: ప్రజల రక్షణ, సమస్యల పరిష్కారం, భద్రత కొరకు పోలీస్ స్టేషన్ నూతన భవనాన్ని ప్రారంభించడం జరిగిందని డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ శివధర్ రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లాలోని కన్నెపల్లి మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన పోలీస్ స్టేషన్ భవనాన్ని మల్టీ జోన్-1 ఐ.జి. చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, రామగుండం కమిషనర్ ఆఫ్ పోలీస్ అంబర్ కిషోర్ ఝా, డి.సి.పి. ఎ.భాస్కర్, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, బెల్లంపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు గడ్డం వినోద్, బెల్లంపల్లి ఎ.సి.పి. కిరణ్ కుమార్, ఇతర పోలీసు అధికారులతో కలిసి పోలీస్ గౌరవ వందనం స్వీకరించి ప్రారంభించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ మాట్లాడుతూ ప్రజల రక్షణకు, భద్రతకు, సమస్యల పరిష్కారానికి, శాంతి భద్రతల పరిరక్షణకు పోలీస్ శాఖ అహర్నిశలు కృషి చేస్తుందని తెలిపారు. ఈ క్రమంలో జిల్లాలోని కన్నెపల్లి మండల కేంద్రంలో పోలీస్ స్టేషన్ నూతన భవనాన్ని ప్రారంభించడం జరిగిందని, ప్రజలు సమస్యల పరిష్కారం కొరకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని తెలిపారు. ప్రజలకు మరింత చేరువలో మెరుగైన సేవలు అందించడం జరుగుతుందని, ప్రజారక్షణలో సాంకేతికతను వినియోగించి భద్రతను మరింత కట్టుదిట్టం చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం బెల్లంపల్లి పట్టణంలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్ లో ఆటో డ్రైవర్లు, లారీ డ్రైవర్లకు కంటి పరీక్షలు నిర్వహించి కంటి అద్దాల పంపిణీ కార్యక్రమానికి హాజరై డ్రైవర్లకు కళ్ళజోళ్ళు అందజేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ మాట్లాడుతూ రాష్ట్రంలో సామాన్యుడి నుండి రాష్ట్ర ముఖ్యమంత్రి వరకు చట్టం ఒకటేనని, ప్రతి ఒక్కరూ రహదారి భద్రత నిబంధనలను పాటించవలసిందేనని తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా అరైవ్ - అలైవ్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని, ప్రతి వాహనదారుడు రహదారి భద్రత నిబంధనలను పాటిస్తూ సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని తెలిపారు. రహదారి సౌకర్యాలు పెరుగుతున్నాయని, తదనగుణంగా వాహనాల వినియోగం పెరుగుతుందని, వాహనదారులు జాగ్రత్తగా వాహనాలను నడపాలని తెలిపారు. ఒక రహదారి ప్రమాదం ఒక కుటుంబం మొత్తాన్ని రోడ్డుపై పడేస్తుందని, రోడ్డు ప్రమాదం అంటే ఒక కుటుంబానికి జరిగే ప్రమాదమని తెలిపారు. గతంలో కంటే వాహనాల సంఖ్య పెరిగిందని, ఇప్పుడు వాహనాలను మరింత జాగ్రత్తగా నడపవలసిన అవసరం ఉందని తెలిపారు. పోలీస్, రవాణా శాఖల సమన్వయంతో ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకున్నప్పటికీ ప్రజలు స్వచ్ఛందంగా భాగస్వామ్యులై వాహనాలను నిబంధనలకు లోబడి జాగ్రత్తగా నడపాలని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా, సక్రమంగా హెల్మెట్ ధరించాలని, ద్విచక్ర వాహనం వెనుక కూర్చున్న వారు కూడా హెల్మెట్ ధరించాలని, కార్లు నడిపేవారు, కారులో ప్రయాణించేవారు తప్పనిసరిగా సీట్ బెల్ట్ ధరించాలని తెలిపారు. ఆటో డ్రైవర్లు యూనిఫామ్ ధరించాలని, పరిమితికి మించి వాహనాలలో ప్రయాణికులను రవాణా చేయకూడదని, వాహనాలు నడిపే సమయంలో ఎట్టి పరిస్థితులలో మొబైల్ వినియోగించకూడదని, మద్యం సేవించి వాహనం నడపకూడదని తెలిపారు. అతివేగం చాలా ప్రమాదమని, అనుభవానికి ప్రమాదానికి సంబంధం లేదని, వేగం పరిమితిలో ఉండి నిబంధనలు పాటించినట్లయితే గమ్యస్థానానికి సురక్షితంగా చేరుకోవచ్చని తెలిపారు. వాహనాలుహొరహదారికి ఎడమవైపు నుండి వెళ్లాలని, ఎట్టి పరిస్థితులలో ముందు వెళ్తున్న వాహనాలను ఎడమవైపు నుండి ఓవర్ టేక్ చేయకూడదని తెలిపారు. వాహనం నడిపే సమయంలో మనం పాటించే చిన్న చిన్న విషయాలే మన ప్రాణాలను కాపాడతాయని తెలిపారు. తదనంతరం రోడ్డు ప్రమాదాలలో మృతి చెందిన వారి కుటుంబాలకు భీమా చెక్కులు అందజేశారు. పోలీస్ హెడ్ క్వార్టర్స్ లోని దుర్గామాత ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు రామగుండంలోని జ్యోతి గెస్ట్ హౌస్ కు చేరుకున్న డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ ను జిల్లా కలెక్టర్ మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి






జగిత్యాల అమృత్ తెలంగాణ ఏప్రిల్ 12: రాజనగర్ తండాలో కార్యకర్తల సమావేశంలో మాల్గొన్న జీవన్ రెడ్డి,గిరిజనులకు రిజర్వేషన్ 6% నుండి 10% పెంచిన ఘనత కేసీఆర్ ది అని అన్నారు,గిరిజన తాండాలను గ్రామ పంచాయతీలుగా చేసింది కేసీఆర్ అని ఈ సమాజంలో ముఖ్యంగా వెనుకబడిన వర్గాలు ఏవి అంటే ఎస్సీ ఎస్టీలు వాళ్లకు రాజ్యాంగం కొన్ని హక్కులు కల్పించింది ఆ రాజ్యాంగ హక్కులకు అనుకూలంగా జనాభా ప్రాతిపదికన విద్యా ఉద్యోగ అభివృద్ధిలో సౌకర్యాలు కల్పింప చేయాలి. మన రాష్ట్రంలో ఎస్సీలు 15% ఎస్టీలు 10% ఉన్నారు వెనుకబడిన తరగతుల వారు అంటే బీసీలు 50 శాతం ఉన్నారు ఇలా వీరందరి అభివృద్ధి కొరకు విద్యా ఉద్యోగ లలో రిజర్వేషన్ కల్పింపచేయాలని రాజ్యాంగంలో వ్యక్తం చేశారు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో గిరిజనులు 10 శాతం ఉంటే ఆరు శాతం రిజర్వేషన్లు ఉండేవి. కానీ తెలంగాణ ఏర్పడ్డ తర్వాత 2014లో నేను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు కెసిఆర్ ఈ ఆరు శాతం రిజర్వేషన్ను 10% పెంచాలని అసెంబ్లీలో తీర్మానం చేశారు. ఎటువంటి ఆటంకాలు రావద్దని కేంద్రానికి నివేదించారు ఐదు సంవత్సరాలు గడిచినవి కేంద్రం నుండి స్పందన రాలేదు కానీ కెసిఆర్ 10 శాతం రిజర్వేషన్ పెంచారు కెసిఆర్ నిరుపేద వర్గాలకు మంచి విద్య బోధన సదుపాయాలు కావాలని గురుకులంలను నిర్మించారు అన్నారు,ఇప్పటి ప్రభుత్వం ఆంగ్ల మాధ్యమంలో రెసిడెన్షియల్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ అని అంటున్నారు కానీ ప్రాక్టికల్ గా కనబడడం లేదు కానీ ఇప్పటివరకు స్థల సేకరణ కూడా పూర్తి కాలేదు ఇప్పటివరకు ఒకనియోజకవర్గంలో కూడా పని మొదలు పెట్టలేదు గత ప్రభుత్వంలో కేసీఆర్ బీసీలకు ,మైనార్టీలకు గిరిజనులకు దళితులకు ప్రత్యేకంగా రెసిడెన్షియల్ స్కూల్ నిర్మించారు కెసిఆర్ ఏర్పాటు వాటికి సొంత భవనాలు లేవు కాని కొత్త ప్రభుత్వం వచ్చిన తర్వాత వాటికి సొంత భవనాలు ఏర్పాటు చేయాలని భావన ఉండాలి ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ఏర్పాటు చేస్తా అన్నది మంచి విషయం కానీ వాటినీ అమలు చేయండి ఈ గురుకులాలకు కూడా నూతన భవనాలను నిర్మించి మౌలిక సదుపాయాలు కల్పించండి ఫీజు రియంబర్స్మెంట్ చెల్లించట్లేదు, ఇట్టి బకాయిలు 7500 కోట్లకు చేరుకుంది ఈ ఫీజు రియంబర్స్మెంట్ బిల్స్ రాక కళాశాలలో సర్టిఫికెట్లు ఇవ్వడం లేదు కోర్టులు కూడా ప్రభుత్వమే భరించాలని చెప్పినవి కెసిఆర్ చేసే కాడికి చేసిర్రు ఇంకా మెరుగైన పాలన వస్తుంది అని భావించినం కానీ ఇప్పుడు మెరుగైన పాలన అనేది తిరోగమనము చెందుతుంది కెసిఆర్ రైతుబంధు పంటకు 5000 ఎకరానికి ఇచ్చిండు అని అన్నారు.కార్యక్రమము జీవన్ రెడ్డి అభిమానులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ జయంతి క్రికెట్ టోర్నమెంట్



టాస్ వేస్తున్న సర్పంచ్ రామానుజజీ



క్రికెట్ టోర్నీ ప్రారంభిస్తున్న రామానుజన్

ఇబ్రహీంపట్నం అమృత్ తెలంగాణ: ఏప్రిల్ 12 జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని వేములకుర్తి గ్రామంలో అంబేద్కర్ జయంతి సందర్భంగా యువకులకు క్రికెట్ టోర్నమెంట్ ను ముందస్తుగా నిర్వహించారు. క్రికెట్ టోర్నమెంట్ స్పాన్సర్ గ్రామ సర్పంచ్ తరి రామానుజం గ్రామంలోని రామాలయ ప్రాంగణ క్రీడామైదానంలో యువకులు గ్రామస్తుల సమక్షంలో టోర్నమెంట్ ప్రారంభించారు. టోర్నమెంట్లో నాలుగు జట్లు పాల్గొన్నాయి. ఫైనల్లో ఎన్టీఆర్ నగర్ జట్టు గాంధీనగర్ జట్లు తలపడుతున్నాయి. టోర్నీలో గెలుపొందిన వారికి అంబేద్కర్ జయంతి మంగళవారం కప్పులు అందజేయనున్నారు. ఈకార్యక్రమంలోయామపుర్ సహకారసంఘ మాజీ చైర్మన్ అంకతి రాజన్న, ఉపసర్పంచ్ బర్మ మల్లయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్ గుమ్మల రమేష్,నాయకులు పెంట లింబద్రి,దేశెట్టి రాజరెడ్డి, నాంపల్లి వెంకటాద్రి, బుర్రి ముత్యం,రాదరపు దేవదాస్,పుప్పాల నాగేశ్,అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు గుమ్మల గంగన్న, అలయకమిటీ చైర్మన్ కోబ్బజి లక్ష్మి నర్సయ్య,టోర్నీ ఆర్గనైజర్స్ పట్నం నవీన్ ,లంక సురేష్, కొత్తూరి ఉదయ్ ,చిట్యాల రాజకుమార్,వార్డుల సభ్యులు దోనికెన రాజేశ్, గోపు రాజేంధర్,మాల సంఘ అధ్యక్షులు అసతి నడ్పి రాజం,పట్నం రాములు, మాదిగ సంఘ అధ్యక్షులు లంక నరేష్,కోంపెల్లి రాజయ్య, పట్నం లక్ష్మణ్ ఈ కార్యక్రమంలో యూత్ సభ్యులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్ ఫలితాల్లో జిల్లా విద్యార్థుల ప్రతిభ..
# శుభాకాంక్షలు తెలిపిన జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్..



జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ జిల్లా ఏప్రిల్ 12 అమృత్ తెలంగాణ ఆదివారం రోజు విడుదలైన ఇంటర్ పరీక్ష ఫలితాలలో జిల్లా విద్యార్థులు ఘనమైన ప్రతిభ కనబరిచారని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఫలితాలలో, నిర్మల్ జిల్లా, 62.93 శాతం ఉత్తీర్ణతతో రాష్ట్ర స్థాయిలో 12 వ ర్యాంక్, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో 73.43 శాతం ఉత్తీర్ణతో 13 వ స్థానంలో నిలిచిందని పేర్కొన్నారు. విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించడం పై కలెక్టర్ హర్షం వ్యక్తం చేశారు. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ఈ సందర్భంగా ఆమె శుభాకాంక్షలు తెలిపారు. ముమ్ముందు పై తరగతుల్లో మరింత కష్టపడి చదివి, ఉన్నతంగా నిలవాలని ఆకాంక్షించారు. అనుత్తీర్ణులు అయిన విద్యార్థులు బాధపడకూడదని, మరింత కష్టపడి చదివి ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. విద్యార్థులు ఉత్తీర్ణత సాధించేలా కృషిచేసిన ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు కలెక్టర్ అభినందనలు తెలియజేశారు. రానున్న రోజుల్లో మరింత మంచి ఫలితాలు సాధించి జిల్లాను రాష్ట్రస్థాయిలో మంచి స్థానంలో నిలపాలని అప్రకటన ద్వారా తెలిపారు.

# ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు




ఇబ్రహీంపట్నం అమృత్ తెలంగాణ :ఏప్రిల్ 12 జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని వేములకుర్తి గ్రామంలో అదివారం శివాజీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రజల దాహార్తి ని తిరిచ్చేందుకు శివాజీ చౌక్ వద్ద చలివేంద్రం ఏర్పాటు చేశారు. చలివేంద్రాన్ని గ్రామ సర్పంచ్ తరి రామానుజం ప్రారంభించారు. యువత ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని శివాజీ అసోసియేషన్ యువతకు ఆదర్శంగా నిలిచిందన్నారు. ఈకార్యక్రమంలో ఉపసర్పంచ్ బర్మ మల్లయ్య, ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ డైరెక్టర్ గుమ్మల రమేష్, నాయకులు పెంట లింబద్రి,వార్డు సభ్యులు దోనికెన రాజేష్ ,బర్మ మహేష్,పుప్పాల నాగేష్, శివాజీ అసోసియేషన్ యూత్ సభ్యులు గుమ్మల అరవింద్, అంకతి శేఖర్, కుంచాల వెంకట్ రాజ్,చింతం వెంకటేష్,అప్పని అనీల్,కోట రామకృష్ణ, జెజ్జంకి వెంకటేష్ ,రెంఖ రాజన్న యుత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్టాపన లో పాల్గొన్న బోరంచు శ్రీకాంత్ రెడ్డి



విగ్రహ ప్రతిష్టపను కార్యక్రమంలో బోరంచు శ్రీకాంత్ రెడ్డి పక్కన ముడుపు మౌనిషి రెడ్డి సామాజిక కార్యకర్త దృశ్యం

అమృత్ తెలంగాణ తలమడుగు న్యూస్ భరంపూర్ శ్రీ వెంకటేశ్వర ఆలయ సమీపంలో నూతనంగా నిర్మించిన అభయాంజనేయ స్వామి వారి భారీ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి పాల్గొనడం జరిగింది. ముందుగా శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం జరిగిన హనుమాన్ విగ్రహ ప్రతిష్టపనలో పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శ్రీకాంత్ రెడ్డి ని శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో సామజిక కార్యకర్త ముడుపు మౌనిష్ రెడ్డి ఆలయ కమిటీ అధ్యక్షులు ముడుపు కేదారేశ్వర్ రెడ్డి ప్రభాకర్ రెడ్డి, మోహన్ రెడ్డి, వెంకట్ రెడ్డి బర్కం మల్లేష్ లింగారెడ్డి గ్రామ ప్రజలు తదితరులు ఉన్నారు.

ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ దైనందిన జీవితంలో ఆధ్యాత్మికతతోనే ప్రశాంతమైన జీవనం సాధ్యమవుతుందన్నారు. తమ స్వంత ఖర్చుతో ఇంత భారీ విగ్రహాన్ని నిర్మించిన విగ్రహ దాతలు గోక లక్ష్మీబాయి- సుభాష్ రెడ్డి ని మరియు గోక రవళి- రఘుకుల్ రెడ్డి ని, శ్రీమాన్ రెడ్డి గార్లను అభినందించారు.

# వివాహ వేడుకకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్



అమృత్ తెలంగాణ బోథ్ నెరడిగొండ: ఆదిలాబాద్ జిల్లా రిమ్స్ డైరెక్టర్ జై సింగ్ రాథోడ్ సోదరుడు కేతావత్ సర్దార్ సింగ్ కుమార్తె వివాహ వేడుక నేరడిగొండ మండల కేంద్రంలోని లక్ష్మి ఫంక్షన్ హాల్ లో ఘనంగా జరిగింది ఈ వివాహ వేడుకకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్ ఆయన వెంట నాయకులు ఉన్నారు

# రైతుల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం :
# ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య



అమృత్ తెలంగాణ రైతుల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ప్రభుత్వ విప్,ఆలేరు శాసనసభ్యులు బీర్ల అయిలయ్య పేర్కొన్నారు. ఆదివారం ఆలేరు మండలం గోలనుకొండ,కొల్లూరు,మందనపల్లి గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు పండించిన వరి ధాన్యాన్ని సరైన ధరకు కొనుగోలు చేయడానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందన్నారు. కనీస మద్దతు ధర (MSP) ప్రకారం ధాన్యాన్ని కొనుగోలు చేస్తూ రైతులకు న్యాయం జరుగుతుందని తెలిపారు. మధ్యవర్తులు లేకుండా నేరుగా రైతుల నుంచే ధాన్యం సేకరించే విధానాన్ని అమలు చేస్తున్నామని చెప్పారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తాగునీరు, తూకం యంత్రాలు, గన్నీ సంచులు, రవాణా సదుపాయాలు అందుబాటులో ఉంచినట్లు వివరించారు. రైతులు తమ ధాన్యాన్ని శుభ్రంగా, తేమ శాతం సరైన స్థాయిలో ఉంచి తీసుకురావాలని సూచించారు. ధాన్యం అమ్మిన రైతుల ఖాతాల్లో డబ్బులు త్వరితగతిన జమ అయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి జనగాం ఉపేందర్ రెడ్డి, సర్పంచులు జనగాం సుధారాణి శ్రీపాల్ రెడ్డి,ఇందూరి యాదిరెడ్డి,సిరిమర్తి రేణుక నరసయ్య,ఉప సర్పంచ్ లు బాకీ యాదగిరి,గాజుల దశరథ,,పద్మ శశిరేఖ మరియు గ్రామ శాఖ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# కస్తూర్బా గాంధీ జూనియర్ కళాశాల టాపర్గా జాదవ్ నందిని

అమృత్ తెలంగాణ : మండల కేంద్రమైన కుభీర్ కస్తూర్బా గాంధీ జూనియర్ కళాశాలలో ఆదివారం ఇంటర్నెట్ మొదటి సంవత్సరం ఫలితాల్లో కళాశాల టాపర్గా కంప్యూటర్ సైన్స్ విభాగంలో జాదవ్ నందిని టాపర్గా నిలించింది. 500 మార్కులుగాను 484 సాధించింది. ద్వితీయ స్థానంలో జే పూర్ణిమ 468 మార్కులు సాధించారు. మొదటి సంవత్సరం కుబీర్ కస్తూరిబా గాంధీ పాఠశాలలో ఇంటర్మీడియట్ విద్య విభాగం ఏర్పాటు చేయడంతో మొత్తం 27 మంది విద్యార్థుల పరీక్షలు రాయగా ఇందులో 26 ఉత్తీర్ణత సాధించి 96% సాధించారని కళాశాల ప్రిన్సిపల్ వాణి తెలిపారు.

# నేర నియంత్రణలో సీసీటీవీ కెమెరాల పాత్ర కీలకం

## ఇచ్చోడా మండల హెడ్ క్వార్టర్స్ నందు 40 సీసీటీవీ కెమెరాల ప్రారంభం.
## 24 గంటలు నేను నియంత్రణలో కృషి చేసేది సీసీటీవీ కెమెరా
## మరింత విస్తృతంగా ప్రజలు ప్రతి ఒక్కరు కెమెరాల ఏర్పాటు కృషి చేయాలని పిలుపు.
## గంజాయి వల్ల కలుగు అనార్థాలు, ట్రాఫిక్ నియమాలపై అవగాహన : జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్




సమావేశంలో మాట్లాడుతున్న అదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్





అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ నేరాలను అరికట్టడంలో సీసీటీవీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ తెలిపారు. ఇచ్చోడా మండల హెడ్ క్వార్టర్స్‌లో ఏర్పాటు చేసిన 40 సీసీటీవీ కెమెరాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, సీసీటీవీ కెమెరాలు 24 గంటలపాటు నిరంతర పర్యవేక్షణ చేస్తూ నేర నియంత్రణలో పోలీసులకు మూడో కంటిగా సహకరిస్తాయని అన్నారు. కెమెరాల ఏర్పాటు వల్ల దొంగతనాలు, అసాంఘిక కార్యకలాపాలు గణనీయంగా తగ్గుతాయని, నేరస్థులను త్వరగా గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు సులభతరం అవుతుందని వివరించారు. ప్రజల భద్రత కోసం ప్రతి గ్రామం, కాలనీ, వ్యాపార సంస్థలు తమ పరిధిలో సీసీటీవీ కెమెరాలు స్వచ్ఛందంగా ఏర్పాటు చేయాలని జిల్లా ఎస్పీ పిలుపునిచ్చారు. ప్రజలు ముందుకొచ్చి సహకరిస్తే నేరాలను పూర్తిగా నియంత్రించడం సాధ్యమవుతుందని ఆయన పేర్కొన్నారు. అలాగే గంజాయి వంటి మత్తు పదార్థాల వలన కలిగే అనర్థాలపై అవగాహన కల్పిస్తూ, యువత దూరంగా ఉండాలని సూచించారు. గంజాయి సేవించడం, వినియోగించడం, వ్యాపారం, చేయడం తీవ్రమైన నేరాలుగా పరిగణించబడతాయని అన్నారు. ట్రాఫిక్ నియమాలను పాటించడం ద్వారా ప్రాణాలను కాపాడుకోవచ్చని, ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వాహనాలు నడపాలని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ను ధరించాలని తెలిపారు. గ్రామాలలో ట్రాఫిక్ నియమాలు పాటిస్తామని స్వచ్ఛందంగా తీర్మానాలు చేస్తూ, రోడ్డు ప్రమాదాలను అరికట్టాలని, ప్రజలకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇచ్చోడా ఇన్స్పెక్టర్ బండారి రాజు, ఇచ్చోడా సర్పంచ్ కోడప జలై జాకు, బోరిగామ సర్పంచ్ అసిఫ్ ఖాన్, ఇచ్చోడ జిపి ఈఓ సురేష్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జనాభా లెక్కలు, ప్రభుత్వ సర్వే పేరుతో ఇండ్లలోనికి వచ్చే వారి పట్ల అప్రమత్తంగా ఉండాలి : జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఐపీఎస్



జగిత్యాల అమృత్ తెలంగాణ ఏప్రిల్ 12: ఇటీవల నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణంలో కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు ప్రభుత్వ అధికారులుగా నటిస్తూ, ప్రస్తుతం ప్రభుత్వం ప్రారంభించని జనాభా లెక్కలు నిర్వహిస్తున్నామని, ప్రభుత్వ సర్వేలు నిర్వహిస్తున్నామని చెప్పి ఇళ్లకు వెళ్లి చోరీకి పాల్పడం జరిగిందని ఈలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఇళ్లలోకి ప్రవేశించే వ్యక్తులపై ప్రజల అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, ఐపీఎస్ సూచించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. నిజమైన ప్రభుత్వ సిబ్బంది ఎప్పుడూ అధికారిక గుర్తింపు కార్డులు, నియామక పత్రాలు కలిగి ఉంటారని, వాటిని చూపించకుండా ఎవరినీ ఇంట్లోకి అనుమతించకూడదన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలు, పట్టణ పరిసరాల్లో ఒంటరిగా నివసించే వృద్ధులు, మహిళలు ఎక్కువగా లక్ష్యంగా మారే అవకాశం ఉన్నందున కుటుంబ సభ్యులు వారికి ముందుగానే అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే, ప్రభుత్వం తరఫున ఎలాంటి సర్వేలు నిర్వహించినా, ముందుగా సంబంధిత శాఖలు ప్రజలకు సమాచారం అందిస్తాయని, అటువంటి అధికారిక ప్రకటనలు లేకుండా వచ్చే వ్యక్తులపై అనుమానం కలిగితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

జిల్లా ప్రజలకు పోలీస్ శాఖ వారి సూచనలు

ప్రస్తుతం ప్రభుత్వం ఎలాంటి జనాభా లెక్కలు లేదా ఇలాంటి ఇంటింటికి వెళ్లే అధికారిక కార్యక్రమాన్ని ప్రారంభించలేదు. అందువల్ల ఈ పేరుతో ఎవరైనా మీ ఇంటికి వచ్చినట్లయితే వెంటనే అనుమానించాలి. ప్రభుత్వ అధికారులుగా చెప్పుకునే వ్యక్తులు తప్పనిసరిగా అధికారిక గుర్తింపు కార్డు ఐడీ కార్డ్ చూపించాలి. సరైన ధృవీకరణ లేకుండా ఎవరినీ ఇంట్లోకి అనుమతించరాదు. అనుమానాస్పద వ్యక్తులు మీ ఇంటికి వచ్చినప్పుడు, వారితో ఒంటరిగా మాట్లాడకుండా పొరుగువారిని సమాచారం ఇవ్వడం లేదా కుటుంబ సభ్యులను సంప్రదించడం మంచిది. ఇంట్లో ఒంటరిగా ఉన్న మహిళలు, వృద్ధులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి. అవసరం లేకుండా తలుపులు తెరవకుండా, అపరిచితులను లోపలికి అనుమతించకుండా ఉండాలి. అనుమానాస్పద వ్యక్తులు గమనించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్ 100 కు సమాచారం ఇవ్వాలి. ప్రజల అప్రమత్తతతోనే ఇలాంటి మోసాలు, చోరీలు నివారించవచ్చని, పోలీసులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ కొనసాగిస్తున్నారని ఎస్పీ తెలిపారు. ఇలాంటి మోసపూరిత చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, ప్రజల భద్రత కోసం జిల్లా పోలీస్ శాఖ ఎల్లప్పుడూ కట్టుబడి ఉందని ఎస్పీ తెలిపారు.

# భారత రాజ్యాంగాన్ని కాపాడుకుందాం..మనువాద సిద్ధాంతాన్ని ఎదుర్కొందాం : సిఐటియు జిల్లా అధ్యక్షులు కోమటిరెడ్డి చంద్రారెడ్డి



అమృత్ తెలంగాణ ఏప్రిల్ 12: : కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం భారత రాజ్యాంగాన్ని సమూలంగా మార్చి దాని స్థానంలో మనువాద రాజ్యాంగాన్ని తీసుకొచ్చే ప్రయత్నాన్ని అడ్డుకుందామని సిఐటియు జిల్లా అధ్యక్షులు కోమటిరెడ్డి చంద్రారెడ్డి కార్మికులకు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక సిఐటియు జిల్లా కార్యాలయంలో పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు మాయ కృష్ణ అధ్యక్షతన నిర్వహించిన లి"భారత రాజ్యాంగం పరిరక్షణ – సవాళ్ళ"పై సెమినార్ లో ముఖ్య అతిథిగా చంద్రారెడ్డి పాల్గొని మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం భారత రాజ్యాంగంలో పొందుపరిచిన ప్రాథమిక విధులు, ఆదేశిక సూత్రాలను తుంగలో తొక్కి, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ నియంతృత్వ పాలన కొనసాగిస్తున్నారని అన్నారు. ప్రభుత్వ పెద్దలు రాజ్యాంగంలో ఉన్న లౌకిక, సోషలిస్ట్, సామ్యవాద పదాలు ఉచ్చరించేందుకు జంకుతున్నారని అన్నారు. రాజ్యాంగం అందించిన ఫలాలను అట్టడుగు ప్రజలకు అందకుండా ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేయడం వల్ల రిజర్వేషన్లు కనుమరుగు చేస్తున్నారని అన్నారు. విద్యా, వైద్యం నుండి పేదలను దూరం నెట్టేస్తున్నారని తెలిపారు. బాబా సాహెబ్ అంబేద్కర్ ఆశయాలకు భిన్నంగా మనువాద సిద్ధాంతాన్ని అమలు చేసేందుకు అన్ని ప్రభుత్వ విభాగాలలో ఆర్ఎస్ఎస్ వ్యక్తులతో నియామకాలు చేపడుతున్నదని అన్నారు. దేశాన్ని పురోగమనం వైపు కాకుండా తిరోగమనం వైపు తీసుకెళ్తుందని అన్నారు. స్వాతంత్ర్యానికి పూర్వం నుండే సాధించుకున్న కార్మిక చట్టాలను సైతం రద్దుచేసి బాగా డబ్బున్న కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా లేబర్ కోడ్స్ తెచ్చిందని అన్నారు. ఈ లేబర్ కోడ్స్ యూనియన్లు పెట్టుకునే హక్కు, సమ్మె చేసే హక్కు, రాయబారాలు, సంప్రదింపులు లేకుండా చేసి కార్మికులను బానిసలుగా మార్చే ప్రయత్నం చేస్తుందన్నారు. పని గంటలు పెంచడంతోపాటు కనీస వేతనాలపై జవాబుదారితనం లేకుండా వదిలేసే పరిస్థితులు రానున్నాయని మొత్తంగా కార్మికులను శ్రమదోపిడి చేసి బానిసలుగా మార్చేందుకు కుట్రలు చేస్తుందని అన్నారు. పౌర సంబంధమైన క్రిమినల్ చట్టాలను రద్దుచేసి కొత్త చట్టాలను తీసుకొచ్చి పాలకవర్గాలకు, డబ్బున్న వారికి ఉపయోగపడే విధంగా ప్రజలకు వ్యతిరేకమైనవిగా తీసుకొచ్చిందన్నారు. వ్యవసాయ రంగంలో రైతులను తమ భూముల నుండి తామంతట తామే వెళ్లిపోయేందుకు వ్యవసాయ చట్టాలను తెచ్చిందని అన్నారు. అదేవిధంగా గ్రామీణ పేదలకు ఉపాధి హామీ పనులు భవిష్యత్తులో లేకుండా చేయడం కోసం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దుచేసి దాని స్థానంలో విబి జి రామ్ జి స్కీమును తెచ్చిందని అన్నారు. మహనీయుల ఆశయ సాధన కోసం పార్టీలకు అతీతంగా పోరాడుదాం అని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు, పట్టణ కన్వీనర్ గంధముల మాతయ్య, నాయకులు ఊదరి రామచందర్, ఆడెపు వెంకటేష్, ఇటికల బిక్షపతి బాల నరసింహ సల్ల రాజయ్య బట్టు కొండయ్య, రాజలింగం, వరమ్మ, శాంతమ్మ, సత్యమ్మ, సుజాత, సునీత కుమారి పాల్గొన్నారు.

# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం లో పాల్గొన్న ఎంపీ జీ నగేష్





అమృత్ తెలంగాణ అదిలాబాద్ న్యూస్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం లో పాల్గొన్న ఎంపీ జీ నగేష్ ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు గోడం నగేష్ మండలంలోని మాన్కాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తన గతాన్ని నెమరు వేసుకుంటూ జీవితంలో అనేక విషయాలను నేర్చుకుంటూ ముందుకు సాగుతున్న తరుణంలో మన పాత మిత్రులను క్లాస్మేట్ లు పూర్వ విద్యార్థులను కలసుకొని బాగోగులను ఒకరికొకరు పంచుకోవడం మంచి పరిణామమని ఈ కార్యక్రమాన్ని KBSC వారు హైదరాబాద్ వారు గత 26 సంవత్సరాలుగా నిర్వహించడం అభినందనీయమని అన్నారు.

# మురికిమయంగా మారిన నీటిట్యాంకు పరిసరాలు..మంచి నీటి ట్యాంకు వద్ద మురికిని లేకుండా చూడాలని భక్తుల విన్నపం..




## వంజర్ మహాలక్ష్మి టెంపుల్ మంచి నీటి ట్యాంక్ వద్ద మురికి నీరు చేరిన దృశ్యం ఇబ్బందులు పడుతు మంచినీళ్లు పట్టుకుంటున్న భక్తులు



దీంతో ట్యాంకు వద్ద ఉన్న మురికి నీరు దృశ్యం

నిర్మల్ జిల్లా సారంగాపూర్ వంజర్ ఏప్రిల్ 12 అమృత్ తెలంగాణ సారంగాపూర్ మండలంలోని వంజర్ మహాలక్ష్మి టెంపుల్ వద్ద మురికి మయంగా మారిన మంచి నీటి ట్యాంకు వద్ద అశుభ్రత రాజ్యమేలుతుంది నీళ్లు పట్టుకోవాలంటే మురికి నీటిలో కి వెళ్లి నీళ్లు పట్టుకోవాల్సిన పరిస్థితి భక్తులకు ఏర్పడుతుంది టెంపుల్ కమిటీ దండిగా డబ్బులను జమ చేస్తూ కనీసం టెంపుల్ యొక్క మౌలిక సదుపాయాలు కూడా భక్తులకు అందించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు వెంటనే నీటి ట్యాంకుల వద్ద మురికి నీరు లేకుండా శుభ్రత జాగ్రత్తలు వహించాలని భక్తులు కోరుతున్నారు

# ఇంటర్ లో విద్యార్థిని ప్రతిభ



ఏప్రిల్ 12 అమృత్ తెలంగాణ ముధోల్ మండలంలోని చించాల గ్రామానికి చెందిన పీసర అరుణ ,సాయినాథ్ గౌడ్ దంపతుల కూతురు పీసర గీతిక ఇంటర్మీడియెట్ లో ఆదివారం విడుదల చేసిన పరీక్ష ఫలితాల్లో రాష్ట స్థాయిలో మంచి మార్కులు సాధించారు. ఇంటర్ ఎంపిసి విభాగంలో మొదటి సంవత్సరం వార్షిక పరీక్షలో 470 మార్కులకు గాను 466 మార్కులు సాధించింది. దీంతో విద్యార్థిని గ్రామ సర్పంచ్ దొడ్డి కింది సర్వేష్, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు పేడరేషన్ రాష్ట నాయకులు పీసర మహేందర్ గౌడ్, గ్రామస్తులు సత్యనారాయణ, రవి, విశ్వనాథ్, పాండులు ఘనంగా సన్మానించి, అభినందనలు తెలిపారు.

# మద్దతు ధర కోసం ఎదురుచూపులు



అమృత్ తెలంగాణ ఏప్రిల్ 12 : మార్కెట్ లోని వ్యాపారాలు లాభార్ధినే దెయ్యంగా పంట ఉత్పత్తులు కొనుగోళు చేయడం సహజమే అయినా అరుగాలం కష్టపడి కంటికి రెప్పలా చూసుకొని పంటను పండించిన రైతన్నలు దళరుల రాజ్యంలో అడుగడుగునా నిలువునా మోసానికి గురువుతూనే ఉన్నాడు. తీరా పంటలు ధర అమాంతంగా పడిపోవడం తో రైతులు నష్టాల ఉభిలో కురుకుపోతున్నారు. మద్దతు ధర కోసం రైతులు ఎదురు చూపులు చూస్తున్నారు. ప్రభుత్వ కొనుగోళ్లు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో ఇటీవల గత కొన్ని రోజుల నుంచి అకాల వర్షల వల్ల మొక్క జొన్న పంటలు కోసి కుప్పలు వేయగా తడిసి చిందర వందరంగా మారాయి. కూలీలు రాక రైతులు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చేసేది ఏమీ లేక ఇక కూలీలు చెల్లించి రైతులు అప్పుల ఊబిలో పడిపోతున్నారు. దీంతో పెట్టిన పెట్టుబడులు కూడా రాక రైతులు విలవిలలాడుతున్నారు. ప్రభుత్వం రైతులకు ఆదుకోకుండా నిమ్మకు నీరెత్తినట్లు వివరిస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో ఇక్కడి దళారి వ్యవస్థ 1600 1700 కు తక్కువ ధరలకు కొనుగోలు చేసి మండలంలో ప్రతి గ్రామంలో ఉన్న రైతులు మొక్కజొన్న పంటలు సాగు చేశారు. రైతన్నలు దళారుల రాజ్యంలో అడుగడుగున మోసపోతూనే ఉన్నారు. మొక్కజొన్న ప్రభుత్వ మద్దతు ధర 2,400 ఉండగా ఇక్కడి దళారులు మాత్రం 1700 నుంచి 1800 వరకు మొక్కజొన్న పంటలను కొనుగోలు చేస్తున్నారు కొంత మంది వ్యాపరులు రైతుల వద్ద తక్కువ ధరలకు కొనుగోలు చేసి అధిక ధరలకు విక్రయిస్తారు. వెంటనే ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని మండల రైతన్నలు కోరుతున్నారు.

గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలి: గంగామల్లు పార్ది (బి)

కొన్ని రోజుల క్రితం అకాల వర్షాలు, ఈదురు గాలులు కురిశాయి. చేతి కి వచ్చిన పంటలు ఎక్కడ చేయి జారిపోతుందని భయంతో గిట్టుబాటు ధర ఉన్నా లేకపోయినా తక్కువ ధరలకే అమ్ముకుంటున్నాం ఎకరానికి 30 వేల నుంచి 50 వేల వరకు పంటలకు పెట్టుబడి ఖర్చులు చేశాం ఇదే అలుసుగా తీసుకొని వ్యాపారులు తక్కువ ధరలకే కొనుగోళ్లు చేసి మోసం చేస్తున్నరు. ఇప్పటికైనా వెంటనే ప్రభుత్వ కొనుగోలు ఏర్పాటు చేసి ప్రభుత్వ మద్దతు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని కోరుచున్నాము.

పంటలను ప్రభుత్వం కొనుగోలు చేయాలి: సాయి కుభీర్

ప్రభుత్వం మొక్కజొన్న పంటకు మద్దతు ధర కల్పించి ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు ఆదుకోవాలి.

మొక్కజొన్న పంట కోతకు రాకముందే అధిక ధరలు ప్రకటిస్తారు తీరా చేతికి వచ్చిన తర్వాత అమాంతం ధరలు తగ్గిపోతాయి. గ్రామాల్లో విచ్చలవిడిగా దళారులు చొచ్చుకుపోయి రైతులను మోసం చేస్తున్నారు. రైతులను గుర్తించి మద్దతు ధర కల్పించి ఆదుకోవాలని కోరారు.

# ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు మాజీ ఎంపిపి మలహాల్ రావు సత్కారం



అమృత్ తెలంగాణ : ఇంటర్మీడియట్ ఫలితాల్లో మండల కేంద్రమైన తాడిచెర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి కళాశాల పేరును రాష్ట్ర స్థాయిలో నిలబెట్టారు.ఈ సందర్భంగా మండల మాజీ ఎంపీపీ చింతలపల్లి మలహాల్ రావు ఆదివారం ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను శాలువాలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.ప్రతిభ చాటిన విద్యార్థుల్లో పన్నాల సాత్విక ఎంపిసి ఫస్ట్ ఇయర్లో 466 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో 3వ ర్యాంకు,జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించింది.ముడితనపెల్లి అభినవ్ ఎంపిసి ఫస్ట్ ఇయర్లో 448 మార్కులతో కాలేజిలో ద్వితీయ స్థానంలో నిలిచాడు.రామిడి అనూష ఎంపిసి సెకండ్ ఇయర్లో 974 మార్కులతో కళాశాల టాపర్‌గా నిలిచింది.రామిడి సిరి చందన ఎంపిసి సెకండ్ ఇయర్లో 971 మార్కులతో ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకుంది.ఈ సందర్భంగా మాజీ ఎంపిపి మాట్లాడారు ప్రభుత్వ కళాశాలలో చదువుతూ,పరిమిత వనరులతో కార్పొరేట్ విద్యాసంస్థలకు ధీటుగా ఫలితాలు సాధించడం అభినందనీయమన్నారు.విద్యార్థుల కృషిని, అధ్యాపకుల బోధనను ఆయన కొనియాడారు.విద్యార్థులు ఇదే పట్టుదలతో భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆయన ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బండి స్వామి, ఉప సర్పంచ్ బొబ్బిలి రాజు గౌడ్,నాయకులు అర్ని ఉదయ్ పటేల్,విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఇంటర్‌లో మోడల్ స్కూల్ 90 శాతం ఉత్తీర్ణత : అభినందనలు తెలిపిన ప్రిన్స్‌పాల్ పూర్ణచందర్



అమృత్ తెలంగాణ: తెలంగాణ ప్రభుత్వం ఆదివారం విడుదల చెందిన ఇంటర్మీడియట్ ఫలితాల్లో మండలంలోని ఎడ్లపల్లి మోడల్ స్కూల్లో ప్రథమ సంవత్సరంలో మొత్తం విద్యార్థులు 58 పరీక్షకు హాజరు కాగా 52 మంది ఉత్తీర్ణులై 90శాతం సాధించారు. ద్వితీయ సంవత్సరంలో 45 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 44 మంది ఉత్తీర్ణులై 98 శాతం ఉత్తీర్ణత సాధించారు. ప్రథమ,ద్వితీయ సంవత్సరంలో కాలేజి టాపర్‌గా ఎంపిసీలో ఎం.శ్రీజ 961మార్కులు, ప్రథమ సంవత్సరం ఎంపీసీలో ఏ.శ్రీవిద్య 431 మార్కులు సాధించారు. ఉత్తీర్ణత సాధించిన,కాలేజి టాపర్లుగా నిలిచిన విద్యార్థులను గ్రామ సర్పంచ్ జంగిడి శ్రీనివాస్,ప్రిన్స్ పాల్ పూర్ణచందర్ రావు అభినందించారు.

# ఇంటర్‌లో ఫలితాల్లో మైనారిటీ బాలికల గురుకుల జూనియర్ కళాశాల ఘనత



అమృత్ తెలంగాణ : అశ్వారావుపేటలోని తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల (బాలికలు–1) మరోసారి తన ప్రతిభను చాటుకుంది. 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించిన ఇంటర్మీడియట్ ఫలితాల్లో ఈ కళాశాల విద్యార్థినులు రాష్ట్ర స్థాయిలో అగ్రస్థానాలను సాధించి కీర్తి ప్రతిష్టలు పొందారు.ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం బయ్‌పీసీ విభాగానికి చెందిన విద్యార్థిని ఎన్. ఉష 1000 మార్కులకు గాను 992 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో 4వ ర్యాంక్ సాధించింది. అదే విధంగా ఎంపీసీ విభాగానికి చెందిన విద్యార్థిని ఆర్. అపర్ణ 1000 మార్కులకు గాను 991 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో 6వ ర్యాంక్ సాధించింది. విద్యార్థినుల ఈ విజయంపై కళాశాల ప్రిన్సిపాల్ సంగీత , అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు.

క్రమశిక్షణ, కృషి, నాణ్యమైన బోధనతోనే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని తెలిపారు. తల్లిదండ్రులు కూడా ఆనందం వ్యక్తం చేస్తూ విద్యార్థినులను అభినందించారు.రాష్ట్ర స్థాయిలో ర్యాంకులు సాధించడం ద్వారా ఈ కళాశాల మరోసారి తన ప్రతిష్టను నిలబెట్టుకుంది. భవిష్యత్తులో ఇంకా మెరుగైన ఫలితాలు సాధించాలని అధ్యాపకులు ఆకాంక్షించారు.

ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాలు -- 2025 -- 26

తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల బాలికలు -- 1

అత్యధిక మార్కులు పొందిన వారు...

రెండో సంవత్సరం బైపీసీ విద్యార్థిని ని ఎస్.ఉష 992/1000

రెండో సంవత్సరం ఎంపీసీ విద్యార్థిని ఆర్.అపర్ణ 991/1000

మొదటి సంవత్సరం బైపీసీ విద్యార్థిని ఎం.వర్షిత 436/440

మొదటి సంవత్సరం ఎంపీసీ విద్యార్థిని ఎం.సంజన 461/470 మార్కులు సాధించారు.

ఈ కళాశాల లో రెండో సంవత్సరం ఎంపీసీ లో 29 మందికి 29 ఉత్తీర్ణత పొంది 100 శాతం రికార్డు నెలకొల్పారు.

రెండో సంవత్సరం బైపీసీ లో 28 మందికి 27 ఉత్తీర్ణత పొందారు.ఉత్తీర్ణత శాతం (97%)

రెండో సంవత్సరం మొత్తం 57 మంది 56 ఉత్తీర్ణత పొందారు.ఉత్తీర్ణత శాతం (98.2%)

మొదటి సంవత్సరం ఎంపీసీ లో 24 మందికి 22 మంది ఉత్తీర్ణత పొంది, ఉత్తీర్ణత శాతం (91.66%) సాధించారు.

మొదటి సంవత్సరం బైపీసీ లో 42 మందికి 32 ఉత్తీర్ణత పొంది, (76%) ఉత్తీర్ణత శాతం సాధించారు.

మొదటి సంవత్సరం 66 మందికి 54 మంది ఉత్తీర్ణత పొంది (81%) ఉత్తీర్ణత శాతం సాధించారు.

# మంత్రి శ్రీదర్ బాబుకు దండు రమేష్ కృతజ్ఞతలు : మండల అభివృద్ధి నిధుల మంజూరు




అమృత్ తెలంగాణ : మండల అభివృద్ధికి నేషనల్ హైవేస్ అథారిటీ అఫ్ ఇండియా,హైబ్రిడ్ అన్యుటి మోడ్ పథకం ద్వారా రూ. 17.21 కోట్ల నిధులు మంజూరు చేయించిన రాష్ట్ర ఐటి,పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీదర్ బాబుకు ఈజిసి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు దండు రమేష్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు మంత్రిని అడుగగానే తాడిచెర్ల మానేరు నుండి కిషన్ రావు పల్లె వరకు రూ.2.19 కోట్లతో బిటి రోడ్డు,డివైడర్,సెంట్రల్ లైటింగ్, తాడిచెర్ల నుండి నాగులమ్మ క్రాస్ వరకు రోడ్డు,మల్లారం బ్రిడ్జి మరమ్మత్తు రూ. 15.02 కోట్లు మంజూరు చేయించారని తెలిపారు.ఇందుకు మంత్రి శ్రీధర్ బాబుకు మండల ప్రజల పక్షాన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపినట్లుగా చెప్పారు.కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలనలో తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి నిధులు తీసుకరావడంతో పాటు మంథని నియోజకవర్గ అభివృద్ధికి నిబద్ధతో మాజీ స్పీకర్ స్వర్గీయ దుద్దిళ్ల శ్రీపాదరావు ఆశయాలతో దుద్దిళ్ల కుటుంబం పనిచేస్తున్నట్లుగా తెలిపారు.

# పేదల సొంతింటి కల కాంగ్రెస్ తోనే సాధ్యం : కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ముత్యాల సునీల్ రెడ్డి

అమృత్ తెలంగాణ : పేదల సొంతింటి కల కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ముత్యాల సునీల్ రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని ఉప్లూర్ గ్రామంలో నూతనంగా ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశాలు చేసిన లబ్ధిదారులు డాకూరి మంజుల శ్రీనివాస్, మగ్గిడి గంగమణి మల్లేష్ దంపతులను ఆయన అభినందించారు.ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇంటి గృహ ప్రవేశం చేసిన లబ్ధిదారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటాలను అందజేశారు. అనంతరం సునీల్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో సొంతింటి కల కేవలం కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిరుపేదల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగిస్తూ ప్రజా ప్రభుత్వాన్ని నడిపిస్తున్నారు అన్నారు.

# బికినీలో నాగిని బుసలు కొడుతోందే!



బాలీవుడ్ బ్యూటీ మౌనీ రాయ్ హాటెస్ట్ ఎలివేషన్స్ గురించి చెప్పాల్సిన పనిలేదు. ఆందాల ఆరోబోతలో అమ్మడు ముందు వరుసలో ఉంటుంది. పూల్ సైడున టూపీస్.. స్విమ్ షూట్ బికీనీల్లో చేసే రచ్చ అంతా ఇంతా కాదు. తెరచిన పుస్తకం వలే బ్యూటీ అందాలు ఆరబోస్తుంది. ఇసుక తిన్నుల్లో అందాల ఆరబోతతో ఇసుక తుఫాల్నే రప్పిస్తుంది. సందర్భం ఏదైనా మౌని టెంప్టింగ్ ఫోజులకు ఫ్లాట్ అవ్వాల్సిందే. అంతగా గ్లామర్ ఎలివేషన్ పై దృష్టి పెడుతుంది. తాజాగా అమ్మడు మరోసారి టూపీస్ లో చెలరేగిపోయింది. రిసార్ట్ లోఅమ్మడు పూల్ సైడున పువ్వుల పీస్ లో అందాల విందు చేసింది. థై అందాలు..నాభి అందాల ఎక్స్ ఫోజ్ ని పీక్స్ కి తీసుకెళ్లింది. గాల్లోకి ఎగురుతూ మరీ క్యామ్ ఫోజులిచ్చి అమ్మడి అందాలు ఎలివేట్ చేస్తోంది. ఇక రిసార్ట్ గదిలో బ్రౌన్ కలర్ డిజైనర్ దుస్తుల్లోనూ నాగిని తళుక్కున మెరిసింది. టూపీస్ లో పోలిక కాస్త కష్టమైనా గోధుమ రంగు దుస్తుల్లో క్లోజ్ సెల్ఫీ షాట్ లో నాగిని అవతరామే ఎత్తింది. ప్రస్తుతం ఈ రెండు ఫోటోలు నెట్టింట వైరల్ గా మారాయి. నెటిజనులు హాట్ కామెంట్లతో ఎటాకింగ్ దిగారు. మౌని రాయ్ మల్టీట్యాలెంటెడ్ గాళ్. మోడలింగ్ నుంచి గాయనిగా అటుపై నటిగా ఫేమస్ అయింది. సినిమా లకన్నా ఎక్కువగా టీవీషోలతోనే మౌనీరాయ్ ఫోకస్ అయింది. పాప్ ఆల్బమ్ సింగర్ గాను మౌని మెరుపులు మెరిపించిం ది. అయితే నటిగా మాత్రం నిలదొక్కుకోలేదు. బాలీవుడ్ లో కొన్ని సినిమాల్లో నటించినప్పటికీ అవి యాక్టింగ్ అంతగా స్కోప్ లేని చిత్రాలుగానే ఉన్నాయి. కేజీఎఫ్ చాప్టర్ –1లో స్పెషల్ అప్పీరియన్స్ తో సౌత్ లో కొంచెం పేరొచ్చింది. ప్రస్తుతం బాలీవుడ్ లో బ్రహ్మాస్త్ర లో నటిస్తుంది. ఇది మౌని కెరీర్ లో బిగెస్ట్ ఫిల్మ్. అమితాబచ్చన్..నాగార్జున ..రణబీర్ కపూర్ ..అలియా భట్ .. డింపుల్ కపాడియాతో కలిసి మౌని తెరను పంచుకుంటుంది. బ్రహ్మాస్త్ర మౌనీ రాయ్ కెరీర్ ని టర్న్ చేసే చిత్రంగానే భావించొచ్చు. ప్రాజెక్ట్ పై అమ్మడు భారీగానే ఆశలు పెట్టుకుంది.

# కృతి శెట్టి.. శ్రీలీలా ఇప్పుడు మృణాల్ ఠాకూర్



ఉప్పెన సినిమా విడుదలకు ముందే కృతి శెట్టి కి బ్యాక్ టు బ్యాక్ ఆఫర్లు వచ్చాయి. ఆ సినిమా కరోనా వల్ల ఆలస్యం అవ్వడంతో కృతి శెట్టి కెరీర్ ఏమవుతుందో అనే అనుమానాలు కొందరు వ్యక్తం చేశారు. కాని ఉప్పెన ఆలస్యంగా వచ్చిన సూపర్ హిట్ సాధించింది. ఉప్పెన విడుదలకు ముందు నుండే వచ్చిన ఆఫర్లు విడుదల తర్వాత మరింతగా ఎక్కువ అయ్యాయి. ప్రస్తుతం కృతి శెట్టి ఇండస్ట్రీలో ఎన్ని సినిమాల్లో నటిస్తుందో.. ఎన్ని హిట్స్ దక్కాయో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఇక పెళ్లిసంద సినిమా తో హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చిన క్యూటీ శ్రీ లీలా. ఆ సినిమా ఫ్లాప్ అయినా కూడా శ్రీలీలా బిజీ బిజీగా సినిమాలు చేస్తున్న విషయం తెల్సిందే. పెళ్లిసంద సినిమా విడుదలకు ముందు నుండే శ్రీ లీలా సందడి మొదలు అయ్యింది. ఇప్పుడు మృణాల్ ఠాకూర్ కూడా ఆ జాబితాలో చేరింది. బాలీవుడ్ ప్రేక్షకులకు సుపరిచితురాలైన మృణాల్ తెలుగు లో ఎంట్రీ ఇచ్చేందుకు సిద్దం అయ్యింది. తెలుగు సినిమా విడుదలకు ముందే ఈమె సోషల్ మీడియా లో షేర్ చేసిన ఫోటో ల ద్వారా ఇక్కడ కూడా పాపులారిటీని దక్కించుకుంది. హను రాఘవపూడి దర్శకత్వంలో రూపొందుతున్న సీతారామం తో తెలుగు ప్రేక్షకుల ముందుకు మృణాల్ రాబోతుంది. ఇప్పటికే విడుదల అయిన ఫస్ట్ లుక్ తో తెలుగు ప్రేక్షకులను ఈ అమ్మడు అలరించింది. ముందు ముందు ఈ అమ్మడికి టాలీవుడ్ లో మంచి అవకాశాలు వచ్చే అవకాశం ఉందని భావిస్తున్న తరుణంలోనే పలువురు టాలీవుడ్ ఫిల్మ్ మేకర్స్ ఈ అమ్మడి కాంటాక్ట్ కు ప్రయత్నాలు చేస్తున్నారట. సీతారామం విడుదల అయ్యే సమయం కు మృణాల్ చేతిలో మరో రెండు మూడు సినిమాలు ఉండే అవకాశం ఉంది. హను రాఘవపూడి హీరోయిన్స్ ను చాలా అందంగా విభిన్నమైన పాత్రల్లో చూపించి వారు జనాల్లో నోటెడ్ అయ్యేలా చేస్తాడు. కనుక సీతారామం సినిమా తో మృణాల్ కూడా ఖచ్చితంగా టాలీవుడ్ లో నోటెడ్ అవ్వబోతున్నట్లుగా ప్రచారం జరుగుతోంది. హీరోయిన్ గా బాలీవుడ్ లో సినిమాలు చేస్తూనే టాలీవుడ్ లో కూడా టాప్ స్టార్ హీరోయిన్ గా ఈ అమ్మడు పేరు దక్కించుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# ఆద్యంతం థ్రిల్లింగ్ గా సాగిన 'డ్రైవర్ జమున' జర్నీ..!




కోలీవుడ్ లో హీరోయిన్ గా రాణిస్తున్న ఐశ్వర్య రాజేష్.. తెలుగు ప్రేక్షకులకు కూడా సుపరిచితమే. నటనా ప్రాధాన్యమున్న పాత్రల్లో మెపిస్తూ తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకుంది. ఆమె నటుడు రాజేష్ కుమార్తె.. హాస్యనటి శ్రీలక్ష్మి మేనకోడలు. పలు డబ్బింగ్ చిత్రాలతో పలకరించిన ఈ భామ.. 'కౌసల్య కృష్ణమూర్తి' అనే సినిమాతో టాలీవుడ్ లో ఎంట్రీ ఇచ్చింది. ఈ క్రమంలో మిస్ మ్యాచ్' 'వరల్డ్ ఫేమస్ లవర్' 'టక్ జగదీశ్' 'రిపబ్లిక్' వంటి సినిమాలో మెరిసింది. ఇప్పుడు "డ్రైవర్ జమున" అనే చిత్రంతో అలరించడానికి రెడీ అయింది. ఐశ్వర్య రాజేష్ ప్రధాన పాత్రలో పి.కిన్ స్లిన్ దర్శకత్వంలో తెరకెక్కిన తాజా సినిమా "డ్రైవర్ జమున". ఇందులో ఆమె ఒక క్యాబ్ డ్రైవర్ గా కనిపించనున్నారు. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్ ఈ చిత్రంపై ఆసక్తిని కలిగించింది. ఈ నేపథ్యంలో తాజాగా టాలీవుడ్ సీనియర్ ప్రొడ్యూసర్ దగ్గుబాటి సురేశ్ బాబు ట్రైలర్ ను రిలీజ్ చేసి చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలియజేశారు. మధ్యతరగతి కుటుంబం నుండి వచ్చిన జమున అనే ఓ లేడీ క్యాబ్ డ్రైవర్ జీవితంలో జరిగిన సంఘటనల నేపథ్యంలో.. ఈ క్రైమ్ థ్రిల్లర్ తెరకెక్కించారని అర్థం అవుతోంది. ట్విస్టులు కీలక మలుపులతో ఆద్యంతం థ్రిల్లింగ్ గా సాగిన 'డ్రైవర్ జమున' ట్రైలర్ ఆకట్టుకుంటోంది. ఆడపిల్లలు డ్రైవింగ్ ఫీల్డ్ లో చాలా కష్టపడతారు అని ఇంట్లో వాళ్ళు వారిస్తున్నా.. అవేవీ లెక్క చేయకుండా జమున క్యాబ్ డ్రైవర్ గా వెళ్ళింది.

## అమృత్ తెలంగాణ సినిమా వార్తలు

# హీరోయిన్ రేంజ్ అందాల ఆరబోత



తెలుగు బిగ్ బాస్ నాన్ స్టాప్ లో కొన్ని వారాల పాటు ఎంటర్ టైన్ చేసిన స్రవంతి తనదైన శైలి రాయలసీమ యాస తో ఆకట్టుకుంది. బుల్లి తెరపై సుదీర్ఘ కాలంగా కనిపిస్తూ వస్తున్న ఈమె బిగ్ బాస్ తో మరింత పాపులారిటీని దక్కించుకుంది. బిగ్ బాస్ తో వచ్చిన పాపులారిటీతో సోషల్ మీడియాలో స్రవంతి కుమ్మేస్తోంది. గతంలో కూడా స్రవంతి తన హాట్ ఫోటోలను షేర్ చేసేది. కానీ ఇప్పుడు ఇంకాస్త ఎక్కువ అన్నట్లుగా ఈ అమ్మడు రెచ్చి పోతుంది. హీరోయిన్స్ కు ఏమాత్రం తగ్గకుండా ఈమె తన అందాలతో సోషల్ మీడియా లో జనాలకు హీట్ పెంచుతోంది. అందమైన ఈ అమ్మడి ఫిజిక్ తో పాటు మంచి బాడీ లాంగ్వేజ్ వల్ల హీరోయిన్ మాదిరిగా ఉందనే కామెంట్స్ కూడా వస్తున్నాయి. బిగ్ బాస్ తో గుర్తింపు దక్కించుకున్న అషు రెడ్డి.. దివి ఇంకా చాలా మంది కూడా ఇప్పుడు సోషల్ మీడియాలో అందాలు ఆరబోస్తూ ఫాలోవర్స్ ను విపరీతంగా పెంచుకుంటున్నారు. అయితే వారిలో ఎక్కువ శాతం మంది పెళ్లి కాని వాళ్లు ఉన్నారు. అయితే స్రవంతి కి పెళ్లి కావడంతో కొందరు ఈ అందాల ఆరబోత ఫోటోలను విమర్శిస్తూ ఉన్నారు. సినిమాల్లో నటిగా ఈమె కు ఆఫర్లు చిన్నా చితకా సినిమాల నుండి వస్తున్నాయనే వార్తలు కూడా వస్తున్నాయి. ప్రస్తుతానికి సోషల్ మీడియాలో సందడి చేస్తున్న ఈమె బుల్లి తెర మరియు వెండి తెర ద్వారా పాపులారిటీని మరింతగా పెంచుకుని స్టార్ గా నిలుస్తుందేమో చూడాలి.

Printed, Published and Owned by SIGIDI AMRUTH.D.NO: 184C. OLD HOUSING BOARD COLONY -504309,
ADILABAD DISTRICT, TELANGANA. CELL : 9849973404. E-Mail- singidiamruth404@gmail.com